మినీకథ

# పరువు

కె.కె. రఘునందన




రోజూ ఉదయం కూరగాయల బజారుకు వెళ్ళి, శ్రీమతి చెప్పిన నాలుగు కూరలు తెచ్చి పడేయటం. ఆటు తర్వాత ఏ హోటలుకో వెళ్ళి నాలుగు వేడివేడి ఇడ్లీలు కడుపులో పడేసుకోవటం నా దినచర్య.

ఆ రోజుకూడా యింట్లో కూరలు పడేసి టిఫిన్ తినడానికి హోటల్‌కు బయలు దేరాను.

నేను వెళ్ళిన హోటలులో టిఫిన్స్ బాగుంటాయి. అందుకే చాలామంది ఆ హోటల్‌లోనే దూరతారు. అసలే ఆదివారం కావటంవల్ల యమ రద్దీగా వుంది.

నాకు సీటు దొరక్క టిఫిన్ చేస్తున్న ఒకాయన దగ్గర నించొన్నాను. ఆయన వెళ్ళిపోయాక సీట్లో సర్దుకుని కూర్చున్నాక బేరరొచ్చి నిలబడ్డాడు.

అదే సమయంలో నా భుజంపై ఎవరిదో చెయ్యి పడింది. వెనక్కి తిరిగి చూశాను.

"ఒరే! నువ్వా సుబ్బిగా" అంటూ ఆప్యాయంగా వాడి చేతిని నొక్కాను.

"ఏరా బాగున్నావా! చాలా కాలమైంది కలుసుకుని" అని నా చేతిని బలంగా నొక్కాడు.

"బాబూ! మీ రిద్దరూ తీరిగ్గా మాట్లాడుకుందురుగాని ముందు టిఫిన్ ఏటి కావాలో చెప్పండి" అన్న బేరర్ మాటలకు ఈ లోకంలోపడి కాస్త మా వాక్ప్రవాహానికి కామాపెట్టి- టిఫిన్ చెప్పాడు.

ఎదురుగ్గా వచ్చి కూర్చున్నాడు సుబ్బారావు. వాడ్ని చూట్టంతోనే నాకు మేమిద్దరం ఎలా తిరిగామో. చిన్నతనంలో ఎంత అల్లర్లు చేశామో గుర్తొచ్చింది

సుబ్బారావు పుట్టి పిసినారి కూడా! కాలేజీ క్యాంటీన్‌లో ఎవడి నెత్తిమీదో చెయ్యి పేసి బకాసురుడిలా మేసేసేవాడు. అలా తినడానికి ఏ మాత్రం బిడియపడేవాడు కాదు.

పుట్టిన రోజు నాడు కూడా ఫ్రెండ్స్‌ని పిలిచేవాడు కాదు. ప్రతీ పైసా అతి జాగ్రత్తగా తనొక్కడే ఖర్చు చేసుకునే వాడు. హోటల్‌లోనో, సినిమాహాల్లోనో మేము ఎవళ్ళమయినా కనిపిస్తే ముఖం చాటు చేసుకునేవాడు.

అటువంటి సుబ్బారావు- యిప్పుడు కాస్త నీటుగా ఖరీదైన బట్టలు వేసుకుని కనిపించాడు.

టిఫిన్ తింటూంటే వాడికి తెలిసిన వాళ్ళెవరో ప్రక్క సీట్లలో కూర్చుని పలకరించారు.

వాళ్ళకు నన్ను పరిచయం చేశాడు.

"ప్రఖ్యాత రచయిత రవిబాబు మీరా! ఈ ఊరని తెలుసుగాని-యిదే మొద్దటం"

అందులో ఒకాయన నా పరిచయానికి తెగ పొంగిపోయాడు.

వాళ్ళంతా సాహిత్యప్రియులే! అందువల్ల నాతో రకరకాలుగా సంభాషించారు.

ఈ లోగా బేరర్ బిల్లుపట్టుకుని వచ్చాడు. బిల్లు అందుకోబోయాను.

కానీ సుబ్బారావు బేరర్ చేతిలోని బిల్లు అందుకుని. "అరె! చాలాకాలానికి కలిశావని సంతోషిస్తూంటే.... నీ చేత బిల్లిప్పిస్తాననుకున్నావా ఈ సుబ్బారావు. ఈ సుబ్బారావు ఓ ఉద్యోగం సంపాదించాడోయ్!

తే! తే! అని బిల్లుని పట్టుకుని- వాళ్ళతో చెప్పేసి కౌంటర్ దగ్గరకు నడిచి బిల్లు చెల్లించాడు.

నేను వాళ్ళకు చెప్పి బైటకు నడిచాను. కొద్దిసేపు హోటల్ బయట నిలబడి మాట్లాడుకున్నాక సుబ్బారావు మిత్రులు కూడా బైటకు వచ్చారు.

వస్తానని చెప్పి సుబ్బారావు వాళ్ళతో వెళ్ళిపోయాడు.

ఒకప్పటి పిసినిగొట్టుతనం మాని. కాలేజీ రోజులలోలా ఎవడు కనిపిస్తే వాడినెత్తిన బిల్లు రుద్దేయకుండా తాను కూడా కొంత మర్యాద నేర్చుకున్నందుకు పొంగిపోయాను.

ఆలోచిస్తూ గంట స్తంభం దాటాను.

కొద్దిసేపటికి నాభుజంపై ఎవరిదో హస్తం పడింది.

వెనుదిరిగి చూశాను.

ఎవరో కాదు సుబ్బారావే.

ఏమిటన్నట్టు చూశాను!

"బుజ్జీ ఏవమ్మా ఐదు రూపాయలు.... యిలా తే!" అడిగాడు సుబ్బారావు.

నా కర్థంకాక- "ఏ అయిదు రూపాయలు...." ఆయోమయంగా అడిగాను.

"అదేరా చిట్టీ! యిందాక నేనిచ్చిన బిల్లు సొమ్ము" చెప్పాడు.

"అదేంటి నువ్వు చెల్లిస్తావనేగా బిల్లు తీసుకున్నావు!" విస్తుపోయి అన్నాను.

"నువ్వు పప్పులో కాలేశావన్నమాట. ఇందాక టిఫిన్ చేస్తూంటే నాకు బాగా తెలిసిన వ్యక్తులు వచ్చి తగలడ్డారు. వాళ్ల ముందు నేను బిల్లు చెల్లించకపోతే నా పరువు పోతుందని చెప్పి నటించాను. అంతే తప్ప నీకేదో టిఫిన్ ఇప్పించడానికి నా దగ్గర సొమ్ములు మూర్గడం లేదు. తేతే అసలు నాకు అర్జంటు పనుంది" అని చొరవగా నా తెల్లటి చొక్కా జేబులో నుంచి కనిపిస్తున్న పచ్చటి అయిదు కాగితాన్ని లాక్కుని ఉడాయించాడు.

ఒకప్పటి సుబ్బారావు ఇప్పటికైనా మారినందుకు ఎంతగానో సంతోషించిన నేను వాడు వెళ్ళినవైపే చూస్తూ బొమ్మలా నిలబడిపోయాను.